www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 30 సెప్టెంబర్ 2024

5

కాకినాడ



బాధ్యతలు స్వీకరించిన జగ్గంపేట సిఐ

ప్రజాశక్తి - జగ్గంపేట



సిఐ రామకృష్ణశ్రీనివాస్

జగ్గంపేట సిఐగా యడ్ల రామకృష్ణ శ్రీనివాస్ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ సర్పవరం స్టేషన్ నుంచి ఆయన బదిలీపై జగ్గంపేటకు వచ్చారు. ఇప్పటి వరకూ సిఐగా బాధ్యతలు నిర్వర్తించిన లక్ష్మణరావు ప్రభుత్వం విఆర్‌లో ఉంచింది. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్‌కు జగ్గంపేట ఎస్ఐ రఘునాథరావు, గండేపల్లి ఎస్ఐ శివనాగు, కిర్లంపూడి సతీష్, ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూను ఇర్రిపాక గ్రామంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

భవితపై నిర్లక్ష్యం

- కొన్నేళ్లుగా నిలిచిన నిర్వహణ గ్రాంటు
- అలవెన్స్ సరిపోక అదనపు భారం
- అంతంత మాత్రంగానే ఫిజియోథెరపీ సేవలు
- సిబ్బందికి 2 నెలలుగా వేతనాలు పెండింగ్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం నిర్వహిస్తున్న భవిత కేంద్రాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పుట్టుకతో వివిధ సమస్యలతో పుట్టిన చిన్నారులకు పూర్తి స్థాయిలో వీటి సేవలు సక్రమంగా అందడం లేదు. విద్యా బుద్ధులతోపాటు పిల్లల్ని మానసికంగా సరిదిద్దేందుకు వీటిని ఏర్పాటు చేసినా పేద వర్గాలకు చెందిన ప్రత్యేక అవసరాల గల పిల్లలకు అక్కరకు రాకుండా పోతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వమిస్తున్న రవాణా, ఇతర అలవెన్స్ సొమ్ములు సరిపడక పేద, సామాన్య తల్లిదండ్రులపై అదనపు భారం పడుతోంది. మరోవైపు ఫిజియోథెరఫీ సేవలు అరకొరగానే అందుతున్నాయి.

సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 64 భవిత కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటిల్లో సుమారు 1300 మంది ప్రత్యేక అవసరాల గల పిల్లలు, 950 మంది ఫిజియోథేరఫీ చికిత్స పొందుతున్న చిన్నారులు ఉన్నారు. వినికిడి లోపం, నరాల బలహీనత, దృష్టిలోపం, అభ్యసన వైకల్యం, బుద్ధి మాంద్యంతోపాటు 21 రకాల వైకల్యంతో బాధపడే 18 సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించి వీటి ద్వారా శిక్షణ ఇస్తున్నారు.



పిఠాపురంలో భవిత కేంద్రం



పిఠాపురం భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు

అరకొరగానే అలవెన్స్‌లు

గత ప్రభుత్వ హయాంలో నాడు - నేడు పేరుతో రూ.వందల కోట్లు నిధులను ఖర్చుచేసినా భవిత కేంద్రాల నిర్వహణకు మాత్రం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. వివిధ లోపాల గల పిల్లల్ని ఆయా కేంద్రాలకు తీసుకుని రావడానికి తల్లితండ్రులు అనేక వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. వీరంతా పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన సామాన్య ప్రజానీకం కావడంతో అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఏడాదికి రూ.3 వేలు రవాణా భత్యం, ఎస్కార్ట్ అలవెన్స్, ఇతర ప్రత్యేక భత్యాలను ఇస్తున్నారు. వాస్తవానికి పిల్లల్ని కేంద్రాలకు తీసుకుని రావడానికి 6 కిలోమీటర్ల పరిధిలో నెలకు కనీసంగా రూ.1600 నుంచి 2 వేలు ఖర్చవతోంది. అంటే సంవత్సరంలో 10 నెలలపాటు కేంద్రాలకు తీసుకొస్తే రూ.16 వేలు నుంచి రూ.20 వేలు రవాణా ఛార్జీల రూపంలో ఖర్చు అవుతోంది. ఇచ్చే అరకొర ఆర్థిక సాయం సరిపోని పరిస్థితుల్లో పిల్లలను కేంద్రాలకు తీసుకురావడానికి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

సిబ్బంది ఇబ్బందులు

నరాల బలహీనతతో ఇబ్బందులు పడుతున్న పిల్లలకు ప్రతి సోమవారం 13 మంది ఫిజియోథెరఫీ వైద్యుల ఆధ్వర్యంలో వైద్య సహాయం అందిస్తున్నారు. ఒక్కొక్కరూ 2 నుంచి 3 మండలాలు తిరిగి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడంతో ఉన్నవారిపైన భారం పెరుగుతుంది. దీంతో భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ సేవలు నామమాత్రంగానే అందుతున్నాయి. తీవ్ర, అతి తీవ్ర బుద్ధి మాంద్యం గల పిల్లలకు ప్రతి శనివారం వారి వారి ఇళ్ల వద్దకు వెళ్లి విద్యా శిక్షణ అందించాల్సి వస్తుంది. ఎస్ఎస్‌సిలో పనిచేస్తున్న సిబ్బంది అందరికీ రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే పరిస్థితిలోకి వెళ్లారు.

నిలిచిన మెయింటెనెన్స్ గ్రాంట్

గతంలో ఒక్కో కేంద్రానికి ఏడాదికి రూ.10 వేలు మెయింటెన్స్ గ్రాంటు (నిర్వహణ ఖర్చులు) ఇచ్చేవారు. గత నాలుగేళ్లుగా నిలిచిపోవడంతో సిబ్బంది సొంత ఖర్చులు పెట్టుకోవాల్సి వస్తోంది. కరెంట్ బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తున్నా కేంద్రాలను తరచూ శుభ్రం చేయడానికి చీపుర్లు, పినాయిల్, మాస్కులు కొనుగోలు, ఫ్యాన్ల మరమ్మతులు చేసుకునేందుకు కొందరు ఇచ్చే అరకొర జీతాల నుంచే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో భవిత కేంద్రాలపై పూర్తిస్థాయి దృష్టి పెట్టి సామాన్య తల్లిదండ్రులకు అలవెన్స్‌లను పెంచి ఇవ్వాలని, అలాగే కేంద్రాల నిర్వహణకు నిధులను కేటాయించాలని, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కాకినాడ



నూతనంగా నియమించబడ్డ ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కమిటీ ప్రతినిధులు

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా గర్ల్స్ కమిటీని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వరహాలు, ఎం.గంగా సూరిబాబు నూతనంగా ఏర్పాటు చేశారు. జిల్లా గర్ల్స్ కన్వీనర్ గా జి.చిన్ని, కో కన్వీనర్లుగా అమృత, బిందు, కావ్య, కమిటీ సభ్యులుగా హేమ, మంజుల, మల్లేశ్వరి, శివమణి, హేమ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ విద్యారంగంలో ఉన్న సమ్యసలపై ఈ కమిటీ కృషి చేస్తుందన్నారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమ్యసలపై రాజీలేని పోరాటం చేస్తామని, అమ్మాయిలకు ఈవ్ టీజింగ్, తమంతట తాము ఎలా రక్షించుకోవాలో అనే విషయాలపై అవగాహన కల్పించడం కోసం కమిటీ కృషి చేస్తుందన్నారు. మహిళలకు విద్యా, ఉద్యోగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయ వృత్తి దోహదం

ప్రజాశక్తి - ఏలేశ్వరం



ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

సమాజ అభివృద్ధికి అవసరమైన మానవ వనరులను అందించేందుకు ఉపాధ్యాయ వృత్తి దోహదం చేస్తుందని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. ఆదివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా, మండల ఉత్తమ ఉపాధ్యాయులను సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేలాదిమంది ఉత్తమ భావి భారత పౌరులను తీర్చిదిద్దే అవకాశం కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన దేశెట్టి రామలక్ష్మి, జి.మురళీకృష్ణ, మండల ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీతలు ఎం.భాద్య, సిహెచ్. స్వరాజ్యలక్ష్మి, కె.లింగేశ్వరి, కె.దేవదేవి, టి.శ్రీనివాస రావు, కె.వీర్రాజులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, వైస్ ఎంపిపిలు చిక్కాల రాజ్యలక్ష్మి, సాదే లోవరాజు, మాజీ .జడ్‌పిటిసి జ్యోతుల పెదబాబు, బొద్దిరెడ్డి గోపి, ఎంపిడిఒ జె.శ్రీనివాస్, ఎంఇఒలు బి.అబ్బాయి, కె.వరలక్ష్మి, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

చిన్ననాటి గురువుతో ఎంఎల్ఎ

ప్రజాశక్తి - సామర్లకోట



చిన్ననాటి గురువుతో ఎంఎల్ఎ చినరాజప్ప

తనకు చిన్ననాడు చదువు చెప్పిన వెంకన్న మాస్టర్‌తో అచ్చంపేటలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. అలాగే ఆయన యోగక్షేమాలను చినరాజప్ప అడిగి తెలుసుకున్నారు. ఏ అవసరం ఉన్న తనకు ఫోన్ చేయమని కోరారు. చినరాజప్ప తనయుడు రంగనాగ్‌ను ఆయనకు పరిచయం చేశారు.

పిహెచ్‌సి వైద్యుల ఆందోళన విరమణ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ ఆందోళన కార్యక్రమాన్ని విరమించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ నుంచి లభించిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎపి పిహెచ్‌సిడిఎ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.రవి కుమార్, డాక్టర్ ఆర్.పవన్‌కుమార్ వెల్లడించారు. తమ సంఘ ప్రతినిధులు చర్చల్లో మంత్రి సత్యకుమార్ 85 జిఒను సవరిస్తామని, క్లినికల్ విభాగంలో 15 శాతం బదులు 20 శాతం సీట్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇన్ సర్వీస్ కోటాలో సీట్ల కేటాయింపుపై నిర్ణయాలు తీసుకుంటామని, ఇతర డిమాండ్‌లను నెరవేరుస్తామని మంత్రి ఇచ్చిన హామీని స్వాగతిస్తున్నామని వారు తెలిపారు. దీతో యథావిధిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు కొనసాగిస్తామని వారు వెల్లడించారు.

2 రోజుల పాటు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని మరలావ 11 కెవి ఫీడర్ పరిధిలో చేపట్టే మరమ్మతుల కారణంగా ఈనెల 30, అక్టోబర్ 1వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ ఇఇ ఎవిఎన్‌డి ఎస్.ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివిలి సబ్‌స్టేషన్ పరిధిలోని చదలాడ, ఉలిమేశ్వరం, కాండ్రకోట, గుడివాడ, సిరివాడ, మరలావ, తూర్పుపాకలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గుండె వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కాకినాడ



సూర్య గ్లోబల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ర్యాలీ

గుండె వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని సూర్య గ్లోబల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ బిహెచ్‌పిఎస్.వీర్రాజు అన్నారు. ఆదివారం ప్రపంచ గుండె వ్యాధి భద్రత దినోత్సవం సందర్భంగా ఆయన సూర్య గ్లోబల్ ఆసుపత్రిలో ఉచిత పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి గుండె వ్యాధులు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను నినదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దని కోరారు. సరైన సమయ పాలన, ఆహారం తీసుకుని, ఒత్తిడి లేకుండా జీవనం సాగించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 70 శాతం మంది గుండె సంబంధిత వ్యాధుల పట్ల మరణిస్తున్నారని అన్నారు. గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ యు.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతిరోజు వ్యాయామం చేయాలని, ఒత్తిడి లేకుండా సుగర్, అధిక రక్తపోటును ఆధీనంలో ఉంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ఎన్ పాండా, ఆసుపత్రి ఎఒ రాజా, వివిధ విభాగాలకు చెందిన ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో కార్డియాలజీ విభాగ వైద్యులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డియోథొరాసిక్, వాస్కులర్ సర్జన్ డాక్టర్ ఆర్‌డి.నాయక్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వృద్ధులలోనే కాకుండా యువతలో గుండె జబ్బుల ప్రమాదం వేగంగా పెరుగుతోందన్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవితం ఇందుకు ప్రధాన కారణాలు అన్నారు. ప్రముఖ కార్డియాలజిస్టులు డాక్టర్ ప్రణవ్, డాక్టర్ మాతా శ్రీనివాస్, డాక్టర్ నరేష్ కూరాకుల మాట్లాడుతూ శారీరక శ్రమ లేకపోవడం గుండె జబ్బులకు ప్రధాన కారణమన్నారు. వాకింగ్, జాగింగ్ లేదా సైక్లింగ్ వంటి 30 నిమిషాల శారీరక శ్రమను ప్రతిరోజూ చేయలాన్నారు. ఎక్కువ సేపు మెలకువగా ఉండడం, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను ఎక్కువగా ఉపయోగించడం వల్ల గుండెపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. అటువంటి పరిస్థితిలో తగినంత నిద్ర (7-8 గంటలు) తీసుకోవాలన్నారు. సెంటర్ హెడ్ సుభాకరరావు మాట్లాడుతూ సంవత్సరానికి ఒక్కసారి అయిన ఆరోగ్య పరీక్షలు చేపించుకోవడం ముఖ్యమన్నారు. మెడికవర్ హాస్పిటల్స్‌లో వివిధ రకాల పద్ధతుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట డిగ్రీ కళాశాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వ నిధులతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులను రాబట్టినట్లు ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకూ కళాశాల ఏవిధమైన అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తమ ప్రభుత్వ పాలనలో కళాశాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతోపాటు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను రూ.35 లక్షల నిధులను కోరిన వెంటనే మంజూరు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, చిలకూరి రామ్‌కుమార్, దాట్ల కృష్ణవర్మ, కామినేని జయశ్రీ పాల్గొన్నారు..

రైల్వే కిచెన్, రెస్టారెంట్లలో తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట



తనిఖీలు చేస్తున్న రైల్వే అధికారులు

స్థానిక రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో బేస్ కిచెన్‌లు, రెస్టారెంట్లు, రైల్వే క్యాంటీన్‌లు, ఫుడ్ స్టాల్స్, ప్యాంట్రీ కార్లను శుభ్రపర చడంపై రైల్వే అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బందిలో పరిశుభ్రతను ప్రచారం చేయడం, ఆహారాన్ని వాటి నాణ్యత ప్రమాణాలను పరీక్షించడం, పాత్రలను శుభ్రపరచడం, ఆహార పదార్థాలు, నిల్వ చేసే ప్రదేశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైల్వేస్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కెవి.గిరి, ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, టికెట్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ అజీజ్, టికెట్ కలెక్టర్ రమణ, సిబంది పాల్గొన్నారు.

విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - ఏలేశ్వరం



గురువులతో పూర్వ విద్యార్థులు

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1981-82 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఏలేశ్వరంలో కుటుంబాలతో సహా కలిశారు. ఈ సందర్భంగా ఆరుపదులు వయస్సులో ఉన్న చిన్న పిల్లలై ఆడుతూ పాడుతూ ఉల్లాసంగా గడిపారు. దూర ప్రాంతాల్లో అనేక విధుల్లో స్థిరపడ్డ వారి సైతం అంతరాలను మరిచిపోయి అల్లరి చేశారు. అనంతరం తమకు పాఠాలు నేర్పిన గురువులు ఎం.సత్యనారాయణ, ఉద్దగిరి సోమరాజు ప్రత్యేకంగా సత్కరించారు. పేదరికంలో ఉన్న తమతోపాటు చదివిన వారికి సహాయం అందించాలని, సమాజ సేవ కార్యక్రమాలు నిర్వహించాలని ఒక వాట్సప్ గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు కోర్టు ఎజిపి చెక్కపల్లి శ్రీనివాస్‌కుమార్, న్యాయవాది రామశెట్టి శ్రీనివాస్, ప్రముఖ వ్యాపారవేత్తలు ఊర గంగబాబు, ముచ్చర్ల విజయరమేష్, చిక్కాల సురేష్, నగరసంటి ప్రకాశం, పివి ఆచార్యులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా డేనియల్ బాధ్యతల స్వీకరణ


ప్రజాశక్తి - ప్రత్తిపాడు



సబ్ రిజిస్ట్రార్ డేనియల్

ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్‌గా డేనియల్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన సబ్ రిజిస్ట్రార్ టి.సుబ్బారెడ్డి తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. పిఠాపురంలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న డేనియల్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కార్యాలయ సిబ్బంది దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు శుభాకాంక్షలు తెలిపారు.

కార్టూ'నిజం'



ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని పత్తిగొందిలో స్థానిక సర్పంచ్ దున్న సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో రామచంద్రపురం నేత్ర ప్రాథమిక కంటి ఆసుపత్రి వైద్యులు సిహెచ్. కుమార్, పి.సాయిలక్ష్మి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, యువ నాయకులు దున్న గౌతమ్ మాట్లాడారు. గ్రామంలోని పలువురు కంటి వైద్య సమస్యలతో బాధపడుతుండడాన్ని గుర్తించి శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన వారికి కళ్ళజోళ్ళు ఇవ్వనున్నట్లు, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలకు తరలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు గుత్తుల వెంకటరమణ, ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ, యడ్ల డాక్టర్ బాబు, ధూళిపూడి రామకృష్ణ, గ్రామ పెద్దలు ఉండ్రు కనకయ్య, దడాల శ్రీనివాస్, దున్న చక్రయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ మోకన సుగుణ పాల్గొన్నారు.

సమాజం కోసమే కవిత్వం

ప్రజాశక్తి - కాజులూరు




మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

సమాజం కోసమే కవిత్వం నిలవాలని సుప్రసిద్ధ కవి మధునాపంతుల సత్యనారాయణ మూర్తి అన్నారు. ఆదివారం కవి మధునాపంతుల సత్యనారాయణ మూర్తి కేంద్ర సాహిత్య అకాడమీ, ఆంధ్రీకుటీరం సంయుక్త నిర్వహణలో పల్లిపాలెం గ్రామంలోని కామరాజు కళాక్షేత్రంలో కవితా పఠనం జరిగింది. సత్యనారాయణ మూర్తి ప్రేక్షకులతో తెలుగు కవిత్వం తీరు తెన్నులు, స్వీయ కవిత్వం, తనకు ప్రేరణ ఇచ్చిన అంశాలు తదితరాలపై మాట్లాడారు. కవి సామాజిక బాధ్యతతో కవితా ప్రక్రియకు వన్నె తేవాలన్నారు. యువతరం కవులు, రచయితలు తమ పూర్వకవుల సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని, తద్వారా మంచి సాహిత్యాన్ని సృష్టించగలరని తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యుడు చింతకింది శ్రీనివాసరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రచయితలు దాట్ల దేవదానం రాజు, అవధానుల మణిబాబు సహా కవులు, కథకులూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సభకు ఆంధ్రీ కుటీరం కార్యదర్శి ఎంవి.చలపతి స్వాగతం పలికారు.

వసతిగృహానికి ఇన్వర్టర్ బహూకరణ

ప్రజాశక్తి - జగ్గంపేట



ఇన్‌వర్టర్‌ను అందిస్తున్నఎంఎల్ఎ జ్యోతుల

స్థానిక తాత్కాలిక బాలుర వసతి గృహంలో విద్యుత్ సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు వార్డెన్ ప్రభాకర్ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి, అన్నవరం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు కొత్త కొండబాబు వసతి గృహానికి అవసరమైన ఇన్వర్టర్‌ను ఆదివారం ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా హాస్టల్ వార్డెన్ ప్రభాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వార్డెన్ ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్య ఎంఎల్ఎకు తెలియజేసిన వెంటనే టిడిపి నాయకులు కొండబాబు స్పందించి ఇన్‌వర్టర్‌ను అందజేశారని, విద్యార్థుల తరుపున ఆయనకు వార్డెన్ కృతజ్ఞతలు తెలిపారు.

తోటపేటలో అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా పోలేకుర్రు పంచాయితీ తోటపేటలో అన్నదానం నిర్వహించారు. ఆదివారం స్థానిక రామాలయం వద్ద నిర్వహించిన ఈ అన్నదానంలో వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు. తోటపేట యువకులు, పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



సంఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిఐ

వేట్లపాలెంలో చోరీ

ప్రజాశక్తి- సామర్లకోట

వేట్లపాలెం గ్రామంలో బేతల గుడి వద్ద సాయిబాబా ఇంట్లో ఆదివారం మధ్యాహ్నం భారీ చోరీ జరిగింది. సాయిబాబా పరామర్శకు వెళ్లి కేవలం 15 నిమిషాలలో ఇంటికి తిరిగి రాగా తలుపు తెరిచి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లో బీరువా తెరిచి చూస్తే ఆభరణాలు చోరీ అయినట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.7 లక్షల ఉంటుందని అంచనా. బాధితుల ఫిర్యాదు మేరకు సామర్లకోట సిఐ ఎ.కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా సలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

20 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని జార్జిపేట వై-జంక్షన్ చెక్ పోస్ట్ వద్ద ఆదివారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 20 మందిపై కేసులు నమోదు చేసినట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. జాతీయ రహదారి 216 పై రోడ్డు ప్రమాదాలు నివారించాలనే ఉద్దేశ్యంతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రిలో మృతి చెందిన సంఘటనపై పోలీస్ కేసు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం.. కోయిలగూడెం మండలం బయ్యనగూడెం గ్రామానికి చెందిన మంచిమి సత్యనారాయణ ఈ నెల 28 తేదీ శనివారం తన భార్య రామలక్ష్మితో వాడపల్లి వచ్చి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకుని తిరిగి వెళుచుండగా పులిదిండి సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డుపై మోటార్ సైకిల్ నుంచి ప్రమాదవశాత్తు భార్య భర్తలు ఇద్దరూ పడిపోయారు. ఇద్దరికి గాయాలు అయ్యాయి. రాజమహేంద్రవరం ప్రైవేట్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నారు. సత్యనారాయణ (48) పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

కాలువలో బాలుడు గల్లంతు

ప్రజాశక్తి - సీతానగరం

పేరాలమ్మ గుడి సమీపంలోని కాలువలో బాలుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సీతానగరం గ్రామానికి చెందిన నలుగురు యువకులు ఫొటో షూట్ కోసం రఘుదేవపురం కోటి గ్రామాల మధ్య పేరాలమ్మ గుడి వద్దకు ఆదివారం వెళ్లారు. గుడి సమీపంలో కాలువ వద్ద సాయంత్రం ఐదు గంటలకు ఫోటో షూట్ చేస్తుండగా ఎలుగుబంటి వినయ్(15) కాలువలో జారి పడి గల్లంతయ్యాడు. వెంటనే మిగిలిన యువకులు ప్రమాద విషయం కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలియజేశారు. సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. వినయ్ తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం మండలంలోని నరసాపురపుపేట గ్రామం వద్ద మెర్ల అంబికేశ్వరావు సత్రం దగ్గర ఒక గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందినట్లు గుర్తించారు. సుమారు 80 సంవత్సరాలు గల వృద్ధుడు చనిపోయి ఉన్నట్లు విఆర్ఎ ఇచ్చిన ఫిర్యాదుపై సంఘటనా స్థలానికి వెళ్లి విచారించామని తెలిపారు. వృద్ధుని వివరాలు తెలిసిన వారు రామచంద్రపురం పోలీస్ స్టేషన్ 08857 242333, ఎస్ఐ రామచంద్రపురం 9440796589 ఫోన్ నెంబర్లకు చేసి తెలపాలని ఎస్ఐ శ్రీనివాస్ కోరారు.



వెదురుమూడి మలుపు వద్ద ప్రమాదకరంగా రహదారి

ప్రమాదకరంగా రహదారి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండల పరిధి వెదురుమూడి నుండి జొన్నాడ వెళ్లాలంటే ఆర్ అండ్ బి రహదారి గుంతలతో ప్రమాద భరితంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణాలు చేయాలంటే వాహనదారులు ప్రాణాలు అరచేతితో పెట్టుకోవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రతిరోజు రద్దీగా ఉండే ఈ రహదారి మీదుగా పాఠశాలలకు వెళ్లే వాహనాలు బైకులు వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచు కొస్తుందో అని ప్రయాణికులు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రహదారిలో మలుపు ఉండడం ఆ మలుపు సమీపంలో పెద్దపెద్ద గుంతలు, ఏర్పడడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని ప్రజలు స్థానికులు వాపోతున్నారు. ఈ రహదారి మీదుగా విద్యార్థులు సైకిల్‌పై పాఠశాలకు వెళ్లాలంటే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో ఆ గుంతల్లో జారి పడే ప్రమాదం జరుగుతుందని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు మీదుగా కొత్తూరు, జొన్నాడ, రావులపాలెం, మండపేట తదితర గ్రామాలకు వెళ్లాలంటే నిత్యం ఈ రహదారి మీదుగా ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఎంతో రద్దీగా ఉంటున్న రహదారిపై ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులకు ఎటువంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు గుంతలు ఏర్పడిన ప్రదేశాల్లో మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పొలం పిలుస్తోందితో మెరుగైన సాగు

ప్రజాశక్తితో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాధవరావు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి



తక్కువ పెట్టుబడితో సాగులో అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో వారంలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నాం. వీటిని సద్వినియోగం చేసుకుంటే రైతులకు ఎంతో మేలుకలుగుతుందని అని అంటున్నారు వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు. ఈ సందర్భంగా ప్రజాశక్తి ఆయన్ని పలుకరించింది. జిల్లాలో సాగు, రైతులకు అందించే సాయం, ప్రభుత్వ పథకాలు తదితర అంశాలపై ఆయన పలు విషయాలను పంచుకున్నారు.

'పొలం పిలుస్తోంది' ప్రణాళికలు ఇలా...

పొలం పిలుస్తోంది కార్యక్రమం రబీ సీజన్‌లో నాలుగు నెలలు, ఖరీఫ్ సీజన్‌లో నాలుగు నెలల పాటు నిర్వహించనున్నాము. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల



సిబ్బంది హాజరై కర్షకులకు సూచనలు, సలహాలు ఇస్తారు. వరితో పాటు మినుము, పెసర, ఇతర అపరాల పంటలు, మామిడి, జీడిమామిడి, ఆయిల్ పామ్ వంటి తోటల సాగుపైనా రైతులకు అవగాహన కల్పించనున్నాం.

ప్రతి మండలంలో వారానికి 4 గ్రామాలు

ప్రతి మండలంలో మంగళ, బుధ వారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నాము. రెండు రోజుల పాటు నాలుగు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించేలా కార్యచరణ అమలు చేస్తున్నాం. జిల్లాలో ఉన్న 367 రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు డిసెంబరు వరకూ జరుగుతాయి.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడే లక్ష్యంగా

ధాన్యం సరాసరి దిగుబడి హెక్టారుకు 7.2 టన్నులు కాగా దీన్ని 7.4 టన్నులకు పెంచాలని లక్ష్యంగా తీసుకున్నాం. సాగులో చీడపీడల నివారణ కోసం రైతులు పురుగు మందులు విపరీతంగా చల్లుతున్నారు. వాటి ఖర్చు సాధ్యమైనంత తగ్గించేలా ప్రణాళికలు రూపొందించాం. ఈ కార్యక్రమం ద్వారా రాబోయే రోజుల్లో భూసారాన్ని పెంపొందించటం రైతుల నికర ఆదాయాన్ని పెంచేలా చర్యలు చేపడుతున్నాం.

ప్రభుత్వ పథకాలపై అవగాహన


ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించటంతో పాలు సాగులో క్షేత్ర సమస్యలను తెలుసుకుని వాటి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందివ్వాలనే ధ్యేయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా హాజరవుతారు. తక్కువ ఖర్చుతో రైతన్న ఎక్కువ దిగుబడి సాధించాలన్నదే అందరి లక్ష్యం. ఉద్యాన మార్కెటింగ్, పశువైద్యానికి సంబంధించి ఆ శాఖ సిబ్బందీ హాజరై రైతులకు అవగాహన కల్పిస్తారు.

కౌలు రైతులపై నిర్లక్ష్యం

- నామ మాత్రంగానే రుణాల కల్పన
- లక్ష్యం రూ.275 కోట్లు
- ఇచ్చింది రూ.62 కోట్లు
- అప్పలతో పంట పెట్టుబడులు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కౌలు రైతులు ఏటా కష్టాల కొలిమిలో కొట్టుమిట్టాడుతున్నారు. పంటలకు పెట్టుబడుల కోసం అప్పులు చేసి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు చేపట్టగా ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసేందుకు మరోమారు అప్పులు లభించక బ్యాంకు రుణం కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ప్రభుత్వం సకాలంలో అందిస్తామని ప్రకటించినా వాస్తవ రూపంలో అరకొర రుణాలే మంజూరు చేసింది. కలెక్టర్, ప్రజాప్రతినిధులు తరచూ బ్యాంకర్లతో సమావేశాలను ఏర్పాటు చేసి రుణాలు లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశిస్తున్నా బ్యాంకర్ల నిర్లక్ష్యం కౌలు రైతులను



వెంటాడుతూనే ఉంది. ఖరీఫ్ పెట్టుబడులు కోసం సెప్టెంబరు నెలాఖరులోగా లక్ష్యానికి అనుగుణంగా పూర్తిస్థాయిలో రుణాలు మంజూరు చేయాల్సి ఉన్నా ఖరీఫ్ పూర్తయినా సరే ఇప్పటి వరకూ కేవలం 22 శాతం మాత్రమే కౌలు రైతులకు రుణాలు అందాయి.

జిల్లాలో ఈ ఏడాది 2.19 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో 2.12 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. 1.50 లక్షల మంది రైతులు ఉండగా వీరిలో లక్ష మందికి పైగా కౌలు రైతులే వాస్తవ సాగుదారులుగా ఉన్నారు. అయితే వ్యవసాయ శాఖ అధికారులు ఈ ఏడాది 68,890 మందికి మాత్రమే కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకుని 58 వేల మందికి జారీ చేశారు. ప్రతి ఏడాది జూన్ నుంచి ఈ కార్డులను మంజూరు చేయాల్సి ఉంది. అయితే ఈ ఏడాది జూలై నెల నుంచి కార్డులను అందజేయడం మొదలు పెట్టారు. నేటికీ పూర్తిస్థాయిలో కార్డులను అందజేయకపోవడంతో కౌలు రైతులు ప్రభుత్వ ప్రయోజనాలను కోల్పోతున్నారు.

అరకొర ఋణాలే మంజూరు

ఖరీఫ్ సాగు మొదలైన వెంటనే రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. కానీ జిల్లాలో రెండు నెలలు ఆలస్యంగా బ్యాంకర్లు రుణాల మంజూరును మొదలుపెట్టారు. అవీ అరకొరగానే ఇస్తున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనల ప్రకారం ఎకరాకు రూ.35 నుంచి రూ.38 వేల వరకూ రుణాలు ఇవ్వాలని జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ప్రతీ సంవత్సరం నిర్ణయిస్తున్నారు. ఈ ఏడాది రూ.275 కోట్లు రుణాల ఇచ్చేందుకు లక్ష్యం తీసుకోగా కేవలం 62.56 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఇవి కూడా సిసిఆర్‌సి కార్డులు గల సుమారు 20 వేల మందికి మాత్రమే ఇవ్వగలిగారు. కౌలు రైతుల సంఖ్యకు కార్డులు పొందే వారి సంఖ్యకు చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. కార్డులున్నా అనేకమందికి రుణాలు అందడం లేదు. దీంతో ప్రభుత్వం ప్రతి ఐదుగురు కౌలు రైతులతో జాయింట్ లయబులిటీ గ్రూప్స్ (జెఎల్‌జి) ద్వారా రుణాలు కల్పించాలని లక్ష్యం తీసుకున్నారు. గ్రూపుకు కూడా అరకొరగానే ఏర్పాటు చేశారు.

జీవనోపాధికి సహకరించండి

ప్రజాశక్తి - సామర్లకోట



ఎంఎల్ఎను కలిసిన చిరువ్యాపారులు

స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్ ప్రధాన డ్రెయిన్ పూడికతీత సందర్భంగా తమ దుకాణాలను తొలగించారని, తిరిగి యథాస్థితిలో పెట్టుకునేందుకు చర్యలు తీసుకుని తమ .జీవనోపాధికి సహకరించాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పను బాధితులు కోరారు. ఆదివారం పూడికతీత ప్రాంతానికి ఎంఎల్ఎతో పాటు, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు వచ్చారు. ఈ సందర్భంగా దుకాణాలు, తోపుడుబండ్ల వర్తకులు తమ ఉపాధికి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పూడికతీత సందర్భంగా స్వచ్ఛంధంగానే తమ షాపులను తొలగించామని, అయితే పూడిక తీత అనంతరం రైల్వే అధికారులు ఈ స్థలం తమదని, ఆక్రమణలు చేయవద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారని వారు వివరించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా నిర్వహించుకునేలా చర్యలు చేపడతామని వారికి ఎంఎల్ఎ హామీ ఇచ్చారు.



అధ్వానంగా ఉన్న రాజవరం-పొదలాడ రోడ్డు

రాజవరం-పొదలాడ రోడ్డు శిథిలం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని పులిదిండి గ్రామం నుండి వెలిచేరు వెళ్లే రాజవరం-పొదలాడ ఆర్ అండ్ బి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా తయారై భారీ గుంతలతో ప్రయాణికులను వణికిస్తోంది. ఒకపక్క పంట పొలాలు, మరోపక్క బొబ్బర్లంక మధ్య డెల్టా కాలువ భారీ గుంతలతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి ఇటీవల ఒక బైకు పంట పొలాల్లోకి దూసుకుపోయింది. వాహనదారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రాజవరం నుంచి బొబ్బర్లంక వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు కూడా దెబ్బ తినడంతో వాహన చోదకులు, ముఖ్యంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని గ్రామాల ప్రజలు రాజమహేంద్రవరం వ్యవసాయ ఉత్పత్తులను ఈ రోడ్డు మీదుగా తరలిస్తుంటారు. రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాడైపోయి భారీ కుంతలు ఏర్పడడంతో రైతులు పడే అవస్థలు వర్ణన తీతం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగజేసుకుని రోడ్డుకు మరమతులైన చేపట్టాలని వాహన చోదకులు కోరుకుంటున్నారు. దీనిపై ఆర్ అండ్ బి ఎఇ మణికుమార్‌ను వివరణ కోరగా రూ.35 లక్షలతో ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించామని అనుమతులు రాగానే పనులు చేపడతామని తెలిపారు.

167 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని మడికిలో డాక్టర్ సింగలూరి కావ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కూటమి నాయకులు ఆదివారం సందర్శించి, డాక్టర్ సింగలూరి కావ్య గుణ సుధ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సింగలూరి కావ్య జయంతి సందర్భంగా ప్రతి ఏటా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని లంక గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు కావ్య కుటుంబ సభ్యులు చోడిశెట్టి శ్రీరామచంద్రమూర్తి, చోడిశెట్టి చంద్రశేఖర్, డాక్టర్ సుప్రజ వివరించారు. చెముడులంకతో కావ్యకు విడదీయరాని అనుబంధం ఉందని వారు వివరించారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కావ్య మెమోరియల్ ట్రస్ట్ వారిని, సేవలు అందిస్తున్న వైద్యులను, సిబ్బందిని కూటమి నాయకులు అభినందించారు. అనంతరం వైద్య పరీక్షల ప్రకారం ఉచితంగా



కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న నాయకులు

167 మందికి కళ్ళజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దొండపాటి సుబ్బరాజు, ఈదల రమేష్, అడ్డాల సత్యనారాయణ రాజు, మల్యాల రాజేష్, కొత్తపల్లి నగేష్, అడబాల శ్రీనివాస్, చెల్లబోయిన సింహాచలం, ఈదల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

కరాటేలో రాణిస్తున్న సిస్టర్స్..!

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కరాటేలో బెల్టులు సాధించా, కెరీర్‌లో ఐఎఎస్ పట్టా సాధిస్తా అంటూ ఆత్మవిశ్వాసంతో చెబుతోంది చిన్నారి సౌమ్యశ్రీ వైష్ణవి. మండలంలోని సత్యవాడ గ్రామానికి చెందిన బొర్రా పోతురాజు నాగలక్ష్మిల సంతానం శ్రీవైష్ణవి, హర్షితలు. ప్రయివేటు పాఠశాలలో ఏడు, ఐదవ తరగతులు చదువుతున్న ఈ అక్కచెల్లెళ్ళ వయసు 11, 10 సంవత్సరాలు. ఓవైపు చదువు కొనసాగిస్తూ, మరోవైపు గత రెండున్నర సంవత్సరాలుగా వీరు కరాటేలో శిక్షణ పొందుతున్నారు. వీరు నేర్చుకుంటున్న కరాటేలో ఇప్పటికే అక్క బ్లాక్ బెల్ట్ సాధనకు అతి చేరువలో ఉండగా, సోదరి బ్రౌన్ 1 బెల్ట్ సాధనకు చేరుకుంటోంది. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లు చిన్న వయసులోనే వీరు సాధించిన పతకాల సంఖ్య 24. అక్క 8 బంగారు, 2 రజత, నాలుగు కాంస్య పతకాలు సాధించగా, చెల్లి నాలుగు బంగారు, నాలుగు రజత, రెండు కాంస్య పతకాలు ఇప్పటివరకు సొంతం చేసుకున్నారు. స్కూల్ టీచర్లు చెప్పినట్లు స్వీయ రక్షణ కొరకు, భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఉండేందుకు వివిధ రక్షణ మార్గాల ద్వారా రక్షణ పొందాలన్న మాటలతో తాను స్ఫూర్తి పొందినట్లు శ్రీ వైష్ణవి తెలిపింది. ఇప్పటివరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నో,



కరాటేలో రాణిస్తున్న చిన్నారులు శ్రీవైష్ణవి, హర్షిత

వారణాసిలలో రెండుసార్లు జాతీయ ప్రదర్శనలు, చెన్నైలోని సౌత్ ఇండియా కరాటే టోర్నీలో పతకాలు సొంతం చేసుకుంది. రాష్ట్రస్థాయిలో కనిగిరి, వైజాగ్‌లలో పతకాలు సాధించి, అంతర్జాతీయ స్థాయిలో ఇండో, నేపాల్ టోర్నీలో గోల్డ్ మెడల్ సాధించింది. తమ బిడ్డల ను చూసి పలువురు స్ఫూర్తి పొందాలని, తద్వారా ఆడపిల్లలకు రక్షణ కల్పించుకునే వీలు కలుగుతుందని తల్లిదండ్రులు తెలిపారు. డిసెంబర్‌లో వారణాసిలో నిర్వహించే నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్, మే నెలలో మలేషియన్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్‌కు పోటీలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

లే అవుట్ పూడికలతో రోడ్లు ఛిద్రం

ప్రజాశక్తి - రావులపాలెం

మండలంలో లేఅవుట్ల పూడిక పనులతో రోడ్లు ఛిద్రం అవ్వుతున్నాయి. పొడగట్లపల్లి శివారు లక్ష్మీ పాలెంలో ప్రధాన రహదారిపై భారీ లోడుతో గ్రావెల్ రవాణా చేయడంతో రోడ్లు శిథిలమవుతున్నాయి. ఆ గ్రామం పంచాయతీ పరిధి అయినప్పటికీ జాతీయ రహదారి కొద్దిపాటి మీటర్ల దూరంలో ఉండడడంతో రావులపాలెం దగ్గర కావడంతో లక్ష్మీపాలెం గ్రామం చుట్టూ ఉన్నపొలాలకు గిరాకీ ఏర్పడింది. ఇప్పటికే రెండు మూడు చోట్ల పంటభూములు లేఅవుట్ లుగా మారాయి. ప్రధాన రహదారి గుంతలు ఏర్పడి వర్షపు నీరుతో రోడ్డు బురదమయంగా మారింది. దీంతో గ్రామ ప్రజలు, విద్యార్థులు, కార్మికులు, కర్షకులు తమ విధులకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోంది. అధిక లోడుతో లారీలు రవాణా జరుగుతున్న నేపథ్యంలో మంచి నీరు సరఫరా చేసే పైపులైన్ పగిలి తాగునీటి సమస్యలు ఏర్పడుతున్నాయి. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సేవే లక్ష్యంగా పని చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట

సామాజిక సేవే లక్ష్యంగా నూతన సభ్యులు కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. లైన్స్ క్లబ్ 316 బి పరిధిలో నూతనంగా చేరిన సుమారు 250 మంది క్లబ్ సభ్యులకు ఆదివారం సామర్లకోట రైతు భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. లైన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల వీర వెంకట ఈశ్వర కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పిఎంజె ఎఫ్ఎం శ్రీరామ్ సురేష్, మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్ దామర్ల శ్రీశాంతి, లైన్స్ క్లబ్ మాజీ గవర్నర్లు డాక్టర్ బాదం బాలకృష్ణ, వేలూరి సూర్యనారాయణ తదితరులు లైన్స్ క్లబ్ నిర్వహణ, సభ్యుల విధివిధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట లైన్స్ క్లబ్ నాయకులు ఎస్ఆర్‌వై.ప్రసాద్, టి.సత్యనారాయణ, బడుగు బాబీ, కర్రి ఆదినారాయణ రెడ్డి, గుండు శంకరరావు, గిడుతూరి శ్రీను, మేకా శ్రీను, సేపేని సురేష్, బుర్రె కృష్ణమోహన్, కొర్లమండ వీరభద్రరావు పాల్గొన్నారు.



పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేస్తున్న మాజీ గవర్నర్ రమేష్‌రాజు

ఆర్‌డిఒగా శ్రీరమణి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం



ఆర్‌డిఒ శ్రీరమణి

పెద్దాపురం ఆర్‌డిఒగా కె.శ్రీరమణి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ డిఆర్‌డిఎ పీడీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమె పెద్దాపురం ఆర్‌డిఒగా బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఆర్‌డిఒగా విధులు నిర్వహించిన జె.సీతారామారావు అమరావతిలోని జిఎడికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆర్‌డిఒ శ్రీరమణికి కార్యాలయ ఎఒ.మాధవరావు, డిటి భానుకుమార్, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

దసరా ఉత్సవానికి రాట ముహూర్తం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలో పెదబ్రహ్మదేవం శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించనున్న 65వ వార్షిక శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆదివారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, గ్రామ పెద్దలు చందవోలు వీరవెంకట సత్యనారాయణ, సమితి ఉపాధ్యక్షులు నువ్వుల వెంకట్రాజు, ఆచంట సత్యనారాయణ, నువ్వుల బాబ్జీ, నువ్వుల సూర్య చంద్రరావు, తోటకూర సాంబ శివ రావు, సూర్య ప్రభాకర్, మండవిల్లి శ్రీనివాస్, తోటకూర రాంబాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు లయన్స్ క్లబ్ సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

లయన్స్ క్లబ్ తాళ్ళరేవు శాఖ నుంచి విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.50 వేలను క్లబ్ జిల్లా గవర్నర్ ఇవివి.ఈశ్వర్‌కుమార్‌కు అందజేశారు. ఆదివారం సామర్లకోటలో న్యూ మెంబర్స్ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షులు పొన్నాడ పేరయ్యరాజును గవర్నర్ ఈశ్వర్‌కుమార్ దుస్సాలువతో అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా నాయకులు, ప్రతినిధులు వేలూరి సూర్యనారాయణ, చిట్నీడి శ్రీనివాస్, బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి, పొన్నాడ పేరయ్యరాజబాబు, కనుమూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

రోగికి గుడ్ సీడ్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అంబాజీపేట

మండల పరిధిలో మొసలపల్లి నక్కావారిపేటకు చెందిన బూల సత్యనారాయణ కుమారుడు వంశీ రామ్ రెండు కిడ్నీలూ పాడై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వైసిపి అమలాపురం నియోజకవర్గ సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు వంశీ రామ్ వైద్యానికి ఆర్థిక సాయం అందించారు. వంశీ రామ్ తల్లిదండ్రులకు ఆదివారం అమలాపురంలోని గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో రూ.10 వేల చెక్కును అందజేశారు. ఆర్థిక సాయం అందించిన రమణారావుకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సరెళ్ల రామకృష్ణ, పినిపే జయరాజు, గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు నేరేడిమిల్లి శ్రీను, ఉండ్రు రాజు, రాజా పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురైన బాలునికి సాయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని శివల గ్రామానికి చెందిన మోర్త నాగరాజు, దివ్యల కుమారుడు ఆకాష్ 4వ తరగతి చదువుతున్నాడు. పనుల నిమిత్తం కుతుకులూరులో ఉంటున్న వీరు బంధువుల ఇంటికి కేశవరం వెళ్ళగా డాబాపై ఆడుకుంటూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బాలుని రాజమండ్రి ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య చికిత్సలు అందిస్తున్నారు గాయాలతో ఉన్న యువకుని చూసి శివల గ్రామానికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు సిహెచ్ మూర్తి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.



అన్నదానంలో పాల్గొన్న తారకరామానగర్ వాసులు

3వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పట్టణంలోని 1వ వార్డుకు చెందిన తారకరామ నగర్‌లో ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. 3000 వేల మంది ఈ అన్నదానంలో పాల్గొన్నారు. గోదావరి యూత్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో పెద్దల సహకారంతో తారకరామానగర్ శ్రీలక్ష్మీగణపతి నవరాత్రులు 24వ వార్షికోత్సవం సందర్భంగా ఈ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, వేల్పూరి శ్రీనివాస్, ఆదిరెడ్డి వాసు, కడలి రామకష్ణ, ఆదిరెడ్డి కష్ణ, బళ్ల ధనరాజు, పరుచూరి వెంకటరమణ, దంగేటి వెంకటరమణ, కాటూరు యేసు, ఆదిరెడ్డి సురేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి రాజమహేంద్రవరం వారి కోర్టులో

As.No.54/2023

Between:

1. శీల దుర్గ భవాని D/o.లేటు వీరన్న, డోరు నెం. 18-140, జనార్ధన స్వామి నగర్, ధవళేశ్వరం.
2. శీల సత్యసాయి S/o.లేటు వీరన్న, డోరు నెం. 18-140, జనార్ధన స్వామి నగర్, ధవళేశ్వరం.

...వాదులు

And

1. శీల పద్మ W/o.లేటు వీరన్న, డోరు నెం. 18-140, జనార్ధన స్వామి నగర్, ధవళేశ్వరం.
2. శీల వీరవెంకట రమణ S/o.లేటు రంగారావు, డోరు నెం. 14-194, గొల్లపేట, ధవళేశ్వరం.

...ప్రతివాదులు

ప్రకటన

పై తెలిపి వాదులు మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి రాజమహేంద్రవరం వారి కోర్టులో **Os.No.820/2014** రు దావాలో మీకు అనుకూలంగా వచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పై తెలిపిన కోర్టులో దావా ధాఖలు చేసినారు. సదరు దావాలో మీకు కోర్టు వారు ఎన్ని సార్లు సమన్లు పంపిన తీసుకొనక ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేయి చున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము ది.**15-10-2024**వ తేదిన ఉదయం **10.30** ని॥లకు పై తెలిపిన కోర్టులో స్వయంగా కాని న్యాయవాది ద్వారా గాని హాజరుఅయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యడల దావా మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

బి.వి.రమణ రావు
అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు కాకినాడ

EPNO: 121/2022 in OS.No.702/2020

Between:

మహ్మద్ భాషా ...DHR

మరియు

సాగిరాజు రవికుమార్(died)
సాగిరాజువిజయలక్ష్మి ...JDRs

పై నెంబరు అమలు గ్రంధములో JDR వద్ద నుండి DHR కు రావలసిన డిక్రి బాకీకి గాను JDRs తాలూకు ఈ దిగువ షెడ్యూలు దఖలా ఆస్థిని వేలపు యిస్తీహార్లు షరతులకు లోబడి మరియు యూనియన్ బ్యాంక్ కలెక్టర్ ఆఫీసు బ్రంచ్ కాకినాడ వారి తనఖా బాకీకి లోబడి ది.**14-10-2024** తేదిని ఉదయం గం.**10.30** ని.ల లగాయితూ పై శ్రీ కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయుదురు. పాడదలచినవారు వచ్చి సదరు వేలం పాటనందు పాల్గొని పాడుకోవలెను. వివరములు కొరకు పై శ్రీ కోర్టు నజారత్ నందు గాని, DHR అడ్వకేట్ గారి ఆఫీసునందు గాని తెలుసుకొవలెను.

SCHEDULE: East Godavari District (Kakinada District) Kakinada Sub-Registry, Kakinada Rural, Kovvada Gram Panchayat Limits, Kovvada (V), Plot No.74, Site to an extent of 154.77 sq yards or 129.40 sq.mts along with RCC Roof building therein bearing D.No.3-222 along with all easementary rights situated within the following boundaries:

EAST: 28.0FT OR 8.53MTS 33FT WITH ROAD,
WEST: 28.0FT OR 8.53MTS OTHERS PROPERTY BELONGS TO OTHERS
NORTH:50.3FT OR 15.31MTS LAND IN PLOT NO 75,
SOUTH: 49.3FT OR 15.01MTS SITE IN OF PLTO NO 73,

Within the above boundries, an extent of 154.77 sp.yda. of site along with RCC building with all easementary rights etc.

DHr Value : 12,40,763/-
Amin Value Rs. 44,77,000/-
JDr Value : Nill

షరతులు: షెడ్యూలు దాఖలా ఆస్థిపై యూనియన్ బ్యాంక్, కాకినాడ వారికి గల తనఖా బాకీకి లోబడి పాడవలెను.

కొయ్య దమయంతి
కొయ్య నాగజ్యోతి
న్యాయవాదులు,కాకినాడ, ఫోన్ నెం.6301554476
కాకినాడ
29-09-2024